కథానిక :

# ★ కథ అడ్డంతిరిగింది ★

రచన: శ్రీ "మురళీధర్"

కొంప మునిగి పోయేటట్లు అదివారం పొద్దున్నే గోపాలం పరుగెత్తు కొచ్చాడు. వచ్చినవాడురాక ఎలుగెత్తి అరచాడు.

'గురో'

'ఓ గురో'

'ఓహో గురూ'

'ఓహోహో గురూ'

'ఎవడ్రా యింత పొద్దున్నే' అని కసరాడు నరసింహం.

'నేనురా'

'నేనేమిటిరా నేను. ఏదో నవాబులాగ. ఉట్టి పుగపింగాణీ గొంతుకేసుకుని'

'ఒక్క అయిదు రూపాయలు'

'దొరకవు'

'కావాలి. ప్రమాదంలో యిరుకున్నా'

నరసింహం ముసుగుతన్ని పడుకున్నాడు. గోపాలం గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాడు. గోళ్ళతో నరసింహాన్ని గిల్లాడు.

'ఒరేయ్'

'ఓయ్'

'పలకవేరా'

'డబ్బుతప్ప ఏమన్నాచెప్పు' ముసుగులోంచే తొంగిచూసీ చూడకుండానే, ఇంకా ముసుగులోంచే.

'ముసుగు తియ్యరా'

'మంచిమూడ్‌లో ఉన్నా. కాస్సేపటి క్రిందే కలవచ్చింది. అది యింకా తియ్యగానే ఉంది; నిన్ను మర్చిపోయే ప్రయత్నంలో ఉన్నా. నువ్వు తర్వాత వెళ్ళబోయే చోట నీకు ఘనవిజయం గ్యారంటీ. అందులో నాకు సగం.' ఇంకా ముసుగులోంచే.

'నన్ను పాతేస్తావా'

'ఖర్చు యిచ్చేయ్ ముందరే'

నరసింహం ఒక్కసారి గుర్రుకొట్టినట్లు నటించాడు.

'ఇంతసేపట్లో గుర్రుకొట్టి నిద్రమిటిరా?'

'నిద్రపోయినవాళ్ళు మాట్లాడరు'

బుష్‌కోటుకు పెట్టుకున్న పిన్నీసు తీసి గుచ్చాడు గోపాలం.

దబ్బున లేచాడు నరసింహం. లేచినవాడు ఊరుకోక గోపాలాన్ని లేవదీసాడు.

'పద పోదాం'

'ఎక్కడికి?'

'రామనాథయ్య దగ్గరకి'

'వాడి రూమెక్కడ? వాడు సంసారా? బ్రహ్మచారా?

'రామనాథయ్య అని పల్లకాట్లో ఉంటాడు. వాడి అడ్రెస్‌కు ఉత్తరాలు మోసుకెళ్ళినవాళ్ళు.... .... ....'

'వస్తూంటే క్రికెట్‌మాచ్ అన్నట్లు నీ హ్యూమర్ ఏమిటి?' కడుపులో పందికొక్కులు కదలుతుంటేను'

"అయితే ప్రమాదమే'

'ఆలోచన కావాలి. అది యిప్పుడే కావాలి. అది నీ నుంచే రావాలి.'

'చావటంకూడా ప్రాసలోనే చావాలి? వెనకటికి ఒకడు ముందరకి పడబోయి వెనక్కు పడ్డాడట'

'నన్ను కాదని నువ్వు కథచెబితే ఊరుకునేది లేదు. మనం యిక్కడ ఉండటానికి వీల్లేదు. ఒక్క అయిదు రూపాయలైనా అప్పు తీసుకోకుండా ఉండటానికి వీల్లేదు. వెంటనే యిడ్లీ, కాఫీ, మార్నింగ్ షోకు ప్రయత్నించి మ్యాటనీకైనా వెళ్ళకుండా ఉండటానికి వీల్లేదు....'

"ఒరేయ్, నాకు పది దొరికితే అది యిచ్చుకుంటాను గాని. కాస్త నీ నోటికి తాళం వెయ్యి. నన్ను కాస్త ఆలోచించనీ"

'ఊ. ..... చించు'

'తట్టింది....తట్టిందిరోయ్....'

'ఏమిటి ఆ తట్ట?'

'ఆ....అదే. తట్ట బుజానవేసుకుని మార్కెట్‌లో కాస్సేపు కూరలు మోస్తే కాసిని డబ్బులొస్తాయనుకో. ఈలోపుగా హోటల్లో కూడు పడేసే టైమూ అవుతుంది అప్పుడు మార్నింగ్ షో టైము దాటిపోయి దానిమీద విరక్తి కలిగి, మ్యాటనీ పైన అనురక్తి పెరిగి . .'

'నా తలకాయ తిరిగి....యిక ఊరుకో'

లేచికి లేచిందే ప్రయాణం. మనిషికి వేసిందే టోపీ.

బయలుదేరింది యింకొకళ్ళ జేబు చిల్లు వెయ్యడానికి. అనుమతితో షేర్వాణీ పక్కజేబును పాత సెవెనోక్లాక్ బ్లేడుతో కొయ్యడానికి.

కాని ఎక్కడకు వెళ్ళడం? ఎవ్వడు, చూస్తూ చూస్తూ ఉండగా తనజేబు కోయించుకుంటాడు నిర్దాక్షిణ్యంగా? తప్పదుగా! ఒకడు జేబు కొయ్యడం, మరొకడు తనకు తెలియదేమోనన్నట్లు కోయించుకోవడం, తరువాత మళ్ళా కోయించుకునేదాకా పశ్చాత్తాపంలో పడడం — యిదీ దీని చరిత్ర మూడుముక్కలలో.

గోపాలానికి ఒక idea తట్టింది. బుర్ర గోక్కోకుండానే, బుర్ర ఒకటి ఉందనేవిషయం మర్చిపోయి నప్పటినుంచీ చాలా హాయిగా ఉంటున్నామనీ, గోపాలం మిత్రులందరూ, గోపాలాన్ని "అణాకి కప్పుటీ" యిచ్చే హోటల్లో సన్మానించిన సంగతి మెదడులో మెదిలింది.

'ఒరేయ్'

'ఓయ్'

'మనం వాడిదగ్గరకెళ్ళి...'

'ఎవడురావాడు.... ఊరులేకపోతేపేరూ పేరులేకపోతే ఊరూ, ఈ రెండూ లేకపోయినా అసలు శాలిత్రీ, దానికి ఒక లాగూ లాంటిదో చొక్కా లాంటిదో, వాట్లల్లో ఏ ఒక్క దాంట్లోనో ఒక డబ్బు లున్న పర్సూ ...'

'ఇవన్నీ లేకపోయినా, వాడు, అంటే వెంకయ్య-దరిమిలా వెంకట్రావుగా మారి, మనలా, చచ్చువెధవల్లాగ, బియ్యే గట్టు ప్యాసై ఉద్యోగం చేసీ చెయ్యకుండా, సిగరెట్ల కోసమో, అవి అవతలవాడి జేబులో అయిపోతే బీడీల కోసమో తారట్లాడకుండా, గుట్టుగా జీతంకంటే 'టేబుల్ క్రింద సంపాదన' ఉన్న ఉద్యోగం వెలగబెడుతూ ఉండే ఓ సందర్భంలో, ఓ సినిమా, ఓ కాఫీ యిస్తానని లాలోచీ పడ్డాడు. అవాళమన, అంటే నా జేబులో అయిపోగా మిగిలిన చిల్లరడబ్బులు కక్కూర్తి పడనియ్యలేదు. 'ఇవాల్టికి వద్దులే' అన్నా. ఒక్క సారి ఉబ్బితబ్బిబ్బు అయిపోయి 'అదేమిటిరా అబ్బే, యిచ్చినది పుచ్చుకోననడం మనవంటికి పడదూ, ఆపటా....' అని నచ్చజెప్పాడు. ముందుచూపు మంచిదని, ముందుచూపులేని నాకు తట్టి అన్నాను గదా' సరే మళ్ళాఅవసరంమీద నీ యింటిమీదవచ్చి పడతా' నన్నాను

"ఏడిసినట్లే ఉంది. వాడు యింట్లో ఉంటాడో, ఉండడో? ఉంటే డబ్బు ఉంటుందో ఉండదో? ఉన్నా, యిస్తాడో, యియ్యడో?...."

"ఒరేయ్, సందేహాల దొంతా, పద"

ఇద్దరికీ నల్ల Patches ఉన్న తెల్లపిల్లి కనిపించింది. కనిపించడ మేమిటి, ఎదురైంది!

"ఇదేంశకునం" అన్నాడు ఆశ్చర్యమాఅన్నట్లుగా, గండుపిల్లిలాంటి నరసింహం.

"తెలుపూ, నలుపూ రెండూ ఉన్నాయి కాబట్టి మనం యిదని తేల్చుకోలేం మన ఫలితాన్నిబట్టి శకునం తేల్చుకోవచ్చునులే" అని తేల్చేసాడు గోపాలం.

తిరిగీ, తిరిగీ, తీరికగా కూర్చున్న వెంకట్రావు దగ్గరకు వెళ్ళనే వెళ్ళారు. చూడంగానే అమాంతంగా కౌగలించుకుని "ఇన్నేఉన్నాయిరా" అని ఉన్న ఆ కాసిని కన్నీళ్ళూ కార్చేసి, పక్కనున్న పేము ఊడిపోయిన కుర్చీలమీదకూర్చోమన్నాడు. ఓ కుర్చీమీద నుంచి నీరసంగా ఒక నల్లి పాకుతోంది.

"మీదగ్గరకే వద్దామనుకుంటున్నారా. తీగవెతకబోతే డొంక కాలికి తగిలినట్లు, అమాంతంగా అడగబోయే ముందే అరువు పుట్టినట్లు...." అన్నాడు వెంకట్రావు.

"ఆ ...." అన్నా రిద్దరూ డ్యూయట్ లాగ.

"బొత్తిగా "టేబుల్ క్రింది సంపాదన" పడిపోయిందిరా బ్రదర్స్ కొత్త హెడ్డు గుమాస్తా రావడంతో. మనదాకా రానివ్వడంలేదు. రూపాయనోటు పనిగడితే చాలురా, వాడి పని పట్టేస్తాడు. వాడికో కూతురుంటే అల్లుడై పోదామని ఉంది. రెండు ప్రాబ్లమ్స్ ఒకేసారి సాల్వ్ అయి కూర్చుంటాయి. ఇంతకీ సారాంశం ఏమిటంటే, అలవాటైన ప్రాణం కాబట్టి, కాస్త ట్యాక్సీకీ, ఒక కప్పు కాఫీకీ.. ఈ ఆపదకాయి. మా హెడ్డు గుమాస్తాకు అల్లుణ్ణి కాగానే నీకు..."

వాడు తర్వాత ఏమన్నాడో నరసింహానికీ, గోపాలానికీ వినిపించలేదు. వినిపించుకునేపాటి ఓపికా, తీరికా వాళ్ళలో అయిపోయి ఉరుకుంది.

నిప్పులో నీళ్ళుపోసినట్లు, 'చుంయ్'మని చప్పగాచల్లారి పోయారు. వాళ్ళిద్దరూ వాళ్ళందరి పాలిటా ఆ ఆదివారం మరో వారమై కూర్చుంది!

———O———


# శ్రీ రామకృష్ణా టైప్ ఇన్స్టిట్యూట్

రామానాయుడుపేట - మచిలీపట్నం

( ఇంగ్లీష్ టైప్‌రైటింగ్ మరియు షార్టుహాండు నేర్పబడును )

జాబువర్కు అందంగా, సకాలంలో చేయబడును

మెషిన్ రిపైర్సు మా ప్రత్యేకత.

ఇట్లు,

మానేపల్లి జగన్‌మోహన్‌రావు

ప్రొప్రయిటరు



## భయపడకండి

పోలియో అను పిలువబడు స్నాయివాతం చూసి భయపడకండి.

ఆయుర్వేద పద్ధతులలో గ్యారంటిగా కుదర్చగలం.

ఇప్పటికే ఎన్నో కేసులు కుదిర్చాం.

వివరములకు :

శ్రీ లక్ష్మీ నృశింహ
ఆయుర్వేద వైద్యశాల
మచిలీపట్నం.





PUC
INDIAN HISTORY
MADE EASY
[Q & A]
T. A. DAVID, M. A.
Contact
BOOK ENTERPRISES
VIJAYAWADA-2 (A P)